

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయ కెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



నవంబర్ 10 మంగళవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 274 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

TUESDAY NOVEMBER 10 2026 | VOL:18 | ISSUE: 274 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

కేటీఆర్ గడ్డం పెంచుకుని, విచిత్ర వేషధారణతో గ్రామాల్లో తిరుగుతున్నారు: సీఎం రేవంత్ రెడ్డి

- సొంత చెల్లెలు కవితను ఇంటి నుంచి బయటకు పంపిన క్రూరుడు కేటీఆర్ అని రేవంత్ విమర్శ
- మహిళా సాధికారతపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదన్న ముఖ్యమంత్రి
- కొడంగల్ నియోజకవర్గంలో మహిళా సంఘాలతో ఆత్మీయ సమ్మేళనం
- రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.5 లక్షల మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ల పంపిణీ ప్రారంభం
- 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యమని వెల్లడి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ ఒక క్రూరమైన వ్యక్తి అని, సొంత చెల్లెలు కవితను సైతం ఇంట్లో నుంచి బయటకు గెంటేశారని సీఎం ఆరోపించారు. మహిళా సాధికారత గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు ఏమాత్రం లేదని ఆయన విమర్శించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో స్వయం సహాయక సంఘాల (గ్రూప్+) మహిళలతో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి (మిగతా 2వ పేజీలో..)

పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు: కేటీఆర్

- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా పరిగి వద్ద అడ్డుకున్న వైనం
- రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ముందస్తుగా అరెస్టు చేసినట్లు వెల్లడి

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పార్టీ కార్యకర్త (మిగతా 2వ పేజీలో..)



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిస్తేనే అభివృద్ధి సాధ్యం: బండి సంజయ్

- కరీంనగర్‌లో రూ.4 కోట్ల అర్బన్ డెవలప్‌మెంట్ పనులకు శంకుస్థాపన
- కేంద్రమంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ సంయుక్తంగా ప్రారంభం
- కరీంనగర్ డంప్ యార్డు సమస్యను పరిష్కరిస్తామని మంత్రుల హామీ



కరీంనగర్ జిల్లాలో రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పట్టణాభివృద్ధి (అర్బన్ డెవలప్‌మెంట్) పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు శంకుస్థాపన చేశారు.ఈ (మిగతా 2వ పేజీలో..)

హైదరాబాద్‌పై కాలుష్య పంజా.. ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!

- హైదరాబాద్‌ను వణికిస్తున్న వాయు కాలుష్యం
- ప్రమాదకరంగా 410కి చేరిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- ఐటీ కారిడార్‌లోని పలు ప్రాంతాల్లో అత్యధిక కాలుష్యం
- సాధారణం కంటే నాలుగు రెట్లు పెరిగిన పీఎం 2.5 స్థాయిలు
- వాహనాలు, నిర్మాణాలే ప్రధాన సమస్యగా గుర్తింపు

ఒకప్పుడు ప్రశాంత వాతావరణానికి చిరునామాగా (మిగతా 2వ పేజీలో..)



అనంతపురంలో ఓడిపోయే అవకాశమే లేదు.. కానీ ఓటమి ఎదురైంది: సీఎం చంద్రబాబు

- కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు స్థానిక ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్న చంద్రబాబు
- మార్కాపురం, అనకాపల్లి సహా పలు జిల్లాల్లో వైసీపీకి ఒక్క జెడ్పీటీసీ కూడా దక్కలేదని వెల్లడి
- కుప్పంలో ఒక ఎంపీటీసీ స్థానంలో ఓటమి ఎదురైనా తీర్పును గౌరవించామని స్పష్టీకరణ
- అనంతపురం, గిరిజన ప్రాంతాల్లో ఎదురైన ఫలితాలపై సమీక్ష చేస్తామని ప్రకటన

స్థానిక సంస్థల ఎన్నికల్లో అనంతపురంలో ఓడిపోయే అవకాశమే లేదని, అయినప్పటికీ అక్కడ కూటమికి ఓటమి ఎదురుకావడంపై సమగ్రంగా సమీక్షించుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమికి ప్రజలు తిరుగులేని విజయాన్ని అందించినప్పటికీ, ఒకటిరెండు ప్రాంతాల్లో వచ్చిన ప్రతికూల ఫలితాలను తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై ఆయన సమగ్రంగా మాట్లాడారు. అనంతపురం ఓటమిపై లోతైన విశ్లేషణ జరుపుతామని, అక్కడ ఎందుకు ఓడిపోయామో వాస్తవాల ఆధారంగా పరిశీలించి అవసరమైతే కఠిన నిర్ణయాలు తీసుకుంటామని తేల్చిచెప్పారు.ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో తాము ఎప్పుడూ ముందుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కుప్పంలో ఒక ఎంపీటీసీ స్థానంలో కూటమి ఓడిపోయినప్పటికీ, తాము కక్కుర్తి పడలేదని అన్నారు. ఆ ప్రజా తీర్పును శిరసావహించామే తప్ప అనైతిక పద్ధతుల్లో ఆ స్థానాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నించలేదని తెలిపారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసినప్పుడే అసలైన ప్రజాభిప్రాయం వెల్లడవుతుందనేది తమ సిద్ధాంతమని చెప్పారు. (మిగతా 2వ పేజీలో..)



జిల్లాల్లోనే పూర్తి వైద్య సేవలు అందించడమే లక్ష్యం: మంత్రి దామోదర రాజనర్సింహ

- తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష
- ప్రతి జిల్లాలో డీసీహెచ్ఎస్ కార్యాలయాల ఏర్పాటుపై విస్తృత కసరత్తు
- కమ్యూనిటీ, ఏరియా, జిల్లా ఆసుపత్రుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

తెలంగాణలో సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది. ప్రజలు చిన్న సమస్యలకు కూడా రాజధాని హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా, జిల్లాల్లోనే కార్పొరేట్ స్థాయి పూర్తి వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి (మిగతా 2వ పేజీలో..)



పార్లమెంట్ ప్రోరోగ్‌లో రికార్డు జాప్యం.. ప్రత్యేక భేటీ కోసమేనా?

- 88 రోజులుగా ముగియని పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- 2008 నాటి రికార్డును అధిగమించిన కేంద్ర ప్రభుత్వం
- స్వల్ప నోటీసుతో సభను మళ్లీ సమావేశపరిచే అవకాశం
- మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే ఈ వ్యూహమని ఊహాగానాలు
- లోక్‌సభ సీట్ల పెంపునకు సంబంధించిన రాజ్యాంగ సవరణపై చర్చ

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసి 88 రోజులు



గడిచినా, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ సభలను ప్రోరోగ్ చేయకుండా కొనసాగించడం జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది పార్లమెంట్ చరిత్రలోనే ఓ కొత్త రికార్డు. (మిగతా 2వ పేజీలో..)

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.. ఏపీ, తెలంగాణలో వర్షాలు!

- ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం
- తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన
- తెలంగాణలో క్రమంగా పెరుగుతున్న చలి తీవ్రత, పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- కోస్తాంధ్ర, రాయలసీమలో ఉరుములతో కూడిన వర్షాలు!
- గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం



బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. నవంబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఇది ఏర్పడవచ్చని (మిగతా 2వ పేజీలో..)

విజయకేరళం
తెలుగు దినపత్రిక

02 జనరల్ న్యూస్

సం పా దకీయం

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి.. స్థానిక పాలనలో పారదర్శకత అవసరం!

ఒక గ్రామం లేదా పట్టణం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ నిధులు, అధికార యంత్రాంగం మాత్రమే సరిపోవు. ప్రజల భాగస్వామ్యం, స్థానిక నాయకత్వం, పారదర్శకమైన పాలన కూడా అవసరం. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ, విద్య, వైద్యం వంటి సమస్యలు ప్రజల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తుంటాయి. వీటికి శాశ్వత పరిష్కారాలు చూపాలంటే స్థానిక అవసరాలను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలి. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా చేపట్టే అభివృద్ధి పనులు ఆశించిన ఫలితాలను ఇవ్వలేవు.

గ్రామసభలు, వార్డు సమావేశాలు బలోపేతం కావాలి

స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు, వార్డు సమావేశాలు కీలక వేదికలు. ప్రజలు తమ ప్రాంతంలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వీటిని సమర్థంగా వినియోగించుకోవాలి. గ్రామంలో ఏ పనికి ప్రాధాన్యం ఇవ్వాలి? తాగునీటి సమస్య ఎక్కడ ఉంది? ఏ రహదారిని ముందుగా అభివృద్ధి చేయాలి? పారిశుద్ధ్య సమస్యలను ఎలా పరిష్కరించాలి? వంటి అంశాలపై ప్రజల అభిప్రాయాలు సేకరించాలి.సమావేశాలు కేవలం తీర్మానాలకే పరిమితం కాకుండా వాటి అమలుపై కూడా సమీక్ష జరగాలి. ప్రజలు అడిగే ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు స్థితి అందరికీ తెలిసేలా పారదర్శకత ఉండాలి.

అభివృద్ధి పనుల్లో నాణ్యతే ముఖ్యం

స్థానిక సంస్థల ద్వారా చేపట్టే రహదారులు, కాలువలు, తాగునీటి పైపులైన్లు, భవనాల నిర్మాణాల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. నిధులు ఖర్చు చేయడం ఒక్కటే అభివృద్ధికి కొలమానం కాదు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే పనులు చేపట్టినప్పుడే ప్రభుత్వ వ్యయానికి సార్థకత ఉంటుంది.కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తయిన కొద్దికాలానికే రహదారులు దెబ్బతినడం, కాలువలు పూడిపోవడం, నీటి పైపుల్లో లీకేజీలు ఏర్పడటం వంటి సమస్యలు కనిపిస్తుంటాయి. పనుల ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేలా వ్యవస్థ ఉండాలి.

బడ్జెట్ ఖర్చులపై ప్రజలకు సమాచారం ఇవ్వాలి

స్థానిక అభివృద్ధి కోసం కేటాయించే నిధులు ఎక్కడ ఖర్చవుతున్నాయి? ఏ పనికి ఎంత మొత్తం వెచ్చించారు? పనులు ఎప్పుడు పూర్తవుతాయి? అనే వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. బడ్జెట్ కేటాయింపులు, పనుల పురోగతి, ఖర్చుల వివరాలను బహిరంగంగా ప్రకటించడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రజాధనం ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి. అవసరం లేని పనులకు ప్రాధాన్యం ఇచ్చి, అత్యవసర సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. స్థానిక అవసరాలను బట్టి నిధుల వినియోగానికి ప్రణాళిక రూపొందించాలి. ఆర్థిక క్రమశిక్షణతో పాటు పనుల ఫలితాలను కూడా సమీక్షించాలి.

మహిళలు, యువతకు నిర్ణయాల్లో భాగస్వామ్యం

స్థానిక పాలనలో మహిళలు, యువత, వృద్ధులు, దివ్యాంగులు, వెనుకబడిన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలి. మహిళలకు తాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, పిల్లల విద్య వంటి అంశాలపై విలువైన అనుభవం ఉంటుంది. యువతకు సాంకేతిక పరిజ్ఞానం, కొత్త ఆలోచనలు ఉంటాయి. వీరి అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తే అభివృద్ధి ప్రణాళికలు మరింత సమగ్రంగా రూపొందుతాయి.ప్రజా సమావేశాల్లో అన్ని వర్గాల వారు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించే వాతావరణం కల్పించాలి. నిర్ణయాలు కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను ప్రతిబింబించాలి.

ఫిర్యాదులకు గడువులోగా పరిష్కారం

ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు స్థానిక సంస్థల్లో సమర్థమైన ఫిర్యాదు వ్యవస్థ ఉండాలి. రహదారులపై గుంతలు, తాగునీటి సరఫరాలో అంతరాయాలు, వీధి దీపాల సమస్యలు, చెత్త సేకరణలో జాప్యం వంటి అంశాలపై ప్రజలు సులభంగా ఫిర్యాదు చేయగలగాలి.ఫిర్యాదు స్వీకరించిన తర్వాత దాని పరిష్కారానికి బాధ్యత వహించే అధికారి ఎవరు? ఎప్పటిలోగా పరిష్కరిస్తారు? అనే వివరాలు తెలియజేయాలి. సమస్య పరిష్కారమైన తర్వాత కూడా ఫిర్యాదుదారుడికి సమాచారం అందించాలి. కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా సాంకేతిక సదుపాయాలను ఉపయోగించుకోవాలి.

ప్రజా ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రభుత్వం నిర్మించిన పార్కులు, పాఠశాలలు, గ్రంథాలయాలు, చెరువులు, రహదారులు ప్రజలందరికీ ఉపయోగపడే ఆస్తులు. వాటిని కాపాడుకోవడం స్థానిక ప్రజల బాధ్యత కూడా. ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, ఆక్రమించడం, చెత్తతో కలుషితం చేయడం వల్ల చివరకు నష్టపోయేది సమాజమే.పౌరులు తమ ప్రాంతంలోని అభివృద్ధి కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిస్తేనే అభివృద్ధి సాధ్యం: బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కలిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. నగరంలో ప్రధాన సమస్యగా మారిన డంప్ యార్డ్ అంశాన్ని త్వరలోనే పరిష్కరిస్తామని, దీనిపై ఎవరూ అనవసర వివాదాలు చేయవద్దని సూచించారు. అభివృద్ధి పనులకు కొందరు కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. కాంట్రాక్టర్లను భయపెడితే పనులు కావని, కరీంనగర్ పేరును సర్వనాశనం చేయాలని చూసే నీచ రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని హితవు పలికారు. చిల్లర వేషాలు వేస్తే ప్రజలు ఊరుకోరని, పనులను అడ్డుకుంటే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కరీంనగర్ డంప్ యార్డ్ సమస్య ఇప్పటిది కాదని, దీని పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం సైతం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. తమకు ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత ప్రజా సంక్షేమమే ముఖ్యమని పేర్కొన్నారు. దీంతో పాటు సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ప్రోరోగ్‌లో రికార్డు జాప్యం.. ప్రత్యేక భేటీ కోసమేనా?

మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 13, 2026న లోక్‌సభ, రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడినప్పటికీ, సోమవారం నాటికి కూడా రాష్ట్రపతి వాటిని అధికారికంగా ముగించలేదు (ప్రోరోగ్ చేయలేదు).సాధారణంగా సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాక, రాష్ట్రపతి సభలను ప్రోరోగ్ చేస్తారు. కానీ అలా చేయకపోవడం వల్ల, కేవలం రెండు రోజుల స్వల్ప నోటీసుతో ప్రభుత్వం ఎప్పుడైనా సభలను తిరిగి సమావేశపరచవచ్చు. అదే కొత్త సెషన్ ప్రారంభించాలంటే కనీసం 14 రోజుల నోటీసు అవసరం. ఈ సౌలభ్యం కోసమే కేంద్రం ఉద్దేశపూర్వకంగా సమావేశాలను అధికారికంగా ముగించలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో, మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించిన రాజ్యాంగ సవరణను ఆమోదింపజేసుకోవడానికే కేంద్రం ఈ వ్యూహాన్ని అనుసరిస్తోందన్న ఊహాగానాలు బలపడుతున్నాయి. లోక్‌సభ స్థానాలను ప్రస్తుత 543 నుంచి గరిష్ఠంగా 850కి పెంచే డీలిమిటేషన్ ప్రక్రియతో ఈ బిల్లు ముడిపడి ఉంది. ఇదే తరహా రాజ్యాంగ సవరణ బిల్లు ఏప్రిల్ 17న జరిగిన బడ్జెట్ సెషన్ ప్రత్యేక సమావేశంలో లోక్‌సభలో తగినంత మెజారిటీ లభించక విఫలమైన విషయం తెలిసిందే. గతంలో 2008లో 87 రోజుల పాటు సభలను ప్రోరోగ్ చేయకుండా కొనసాగించడమే ఇప్పటివరకు రికార్డుగా ఉండేది. ఇప్పుడు ఆ రికార్డు బద్దలైంది. సభలను ప్రోరోగ్ చేయడానికి రాజ్యాంగంలో నిర్దిష్ట కాలపరిమితి ఏదీ లేదు, కాబట్టి ఇది నిబంధనల ఉల్లంఘన కాదు. అయితే, సభలను తిరిగి సమావేశపరిచే విషయంపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

కేటీఆర్ గడ్డం పెంచుకుని, విచిత్ర వేషధారణతో గ్రామాల్లో తిరుగుతున్నారు: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.కేటీఆర్ తీరుపై విమర్శలు గుప్పిస్తూ.. గడ్డం పెంచుకుని, వింత వేషధారణలతో కేటీఆర్ గ్రామాల్లో తిరుగుతున్నారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన చేసిన పనుల గురించి స్వయంగా ఆయన సోదరే వెల్లడించారని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మహిళల కోసం ఏం చేశారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.పేదరికాన్ని అధిగమించాలంటే మహిళలు తమ పిల్లలను, ముఖ్యంగా ఆడబిడ్డలను ఉన్నత చదువులు చదివించాలని పిలుపునిచ్చారు. 2034 నాటికి స్వయం సహాయక సంఘాల్లో ఒక కోటి మంది మహిళలను సభ్యులుగా చేర్చి, వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. తన పదవీ కాలంలో కోటి మంది మహిళలు లక్షాధికారులు, కోటీశ్వరులుగా మారితే తన జీవితానికి నిజమైన సార్థకత చేకూరుతుందని రేవంత్ రెడ్డి భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ వేదికపై నుంచే ముఖ్యమంత్రి 'చేయూత' పథకం కింద కొత్తగా 4.5 లక్షల మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఈ కొత్త పింఛన్లలో 3.5 లక్షల మంది ఒంటరి మహిళలు, వితంతువులు ఉన్నారని ఆయన వివరించారు. గత 34 నెలల్లో మహిళల కోసం రూ. 79,000 కోట్ల బ్యాంకు రుణాలను అనుసంధానించామని ముఖ్యమంత్రి వివరించారు. నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిటే రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని రోజూ 37 లక్షల మంది వినియోగించుకుంటున్నారని, ఆర్టీసీకి ప్రభుత్వమే నేరుగా నిధులు సమకూరుస్తూ ఆ సంస్థను లాభాల బాట పట్టిస్తోందని వివరించారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.. ఏపీ, తెలంగాణలో వర్షాలు!

మొదటి పేజీ తరువాయి)

అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, యానాం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.మరోవైపు, తెలంగాణలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఈశాన్య దిశ నుంచి వీస్తున్న పొడి గాలుల కారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 నుంచి 19 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతున్నాయి. రాజేంద్రనగర్, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్ వంటి శివారు ప్రాంతాల్లో ఉదయం వేళ దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. సాయంత్రం 5:30 తర్వాత చలి గాలుల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఇక ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14-16 డిగ్రీలకు పడిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో సాధారణం కన్నా 2-3 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి.కొత్తగా ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో రానున్న రోజుల్లో వర్ష సూచనలు ఉన్నాయి. సోమవారం కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు కూడా వీయొచ్చు. తెలంగాణలోనూ అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడొచ్చని, సోమవారం తర్వాత వాతావరణం పొడిగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అల్పపీడనం ఏర్పడిన తర్వాత దాని కదలిక, తీవ్రతను బట్టి వర్షాల ప్రభావంపై స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రజలు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, చలి నుంచి, ఆకస్మిక వర్షాల నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

హైదరాబాద్‌పై కాలుష్య పంజా.. ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!

మొదటి పేజీ తరువాయి)

ఉన్న హైదరాబాద్ నగరం ఇప్పుడు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీని తలపించేలా గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరం మొత్తం మీద ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ూూ×) 410గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ స్థాయి కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం.. గాలిలోని అతి సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 2.5 స్థాయిలు సురక్షిత పరిమితి అయిన 60 మైక్రోగ్రాములకు బదులుగా 278 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. అదేవిధంగా పీఎం 10 పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం 326 మైక్రోగ్రాములుగా ఉంది. ఇది సాధారణం కంటే దాదాపు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. ఈ స్థాయిలో కాలుష్యం కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఉన్నప్పటికీ, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డిఫెన్స్ కాలనీలో ూూ× ఏకంగా 685గా రికార్డయింది. శేరిలింగంపల్లిలో 666, మణికొండలో 602, యాంబియన్స్ ఫోర్ట్‌లో 596, ఎన్‌బీటీ నగర్‌లో 582గా కాలుష్య సూచీ నమోదైంది. ఈ ప్రాంతాలు కాలుష్య హాట్‌స్పాట్‌లుగా మారుతుండటం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది.హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఇంతలా క్షీణించడానికి ప్రధాన కారణాలు పెరిగిన వాహనాల రద్దీ, అదుపులేని నిర్మాణ కార్యకలాపాలు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ముధూళి, పారిశ్రామిక ఉద్గారాలేనని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో నిరంతరాయంగా సాగే నిర్మాణాలు, వాహనాల రాకపోకలు కాలుష్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పౌరులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. రోడ్లను నీటితో శుభ్రపరచడం, నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవడం, వాహన కాలుష్య తనిఖీలను కఠినతరం చేయడం వంటివి వెంటనే ప్రారంభించాలని సూచిస్తున్నారు. లేకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ లాగా గ్యాస్ ఛాంబర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళుతున్న నాయకుడిని పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు.వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలోని బహార్‌పేట్ చౌరస్తా వద్ద పోలీసులు పట్నం నరేందర్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన కోస్గిలో మరణించిన ఓ బీఆర్ఎస్ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉన్నందున, ముందస్తు జాగ్రత్త చర్యగానే నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ అరెస్టుతో ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసు వాహనాన్ని చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "పరామర్శించేందుకు వెళుతున్న నాయకుడిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏముంది? బాధిత కుటుంబానికి అండగా నిలవడం కూడా ఇందిరమ్మ రాజ్యంలో నేరమైందా? నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాంగ్రెస్ పార్టీ పాలనగా మార్చుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదు. ప్రజల, కార్యకర్తల పక్షాన పోరాటం కొనసాగుతుంది. పట్నం నరేందర్‌రెడ్డిని ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు. మరోవైపు, పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా ఖండించారు. ప్రతిపక్ష నేతలను అకారణంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పార్టీ నేతలు స్పష్టం చేశారు.

జిల్లాల్లోనే పూర్తి వైద్య సేవలు అందించడమే లక్ష్యం: మంత్రి దామోదర రాజనర్సింహా

మొదటి పేజీ తరువాయి)

దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు.హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రుల్లో సేవల నాణ్యత, పనితీరును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) కార్యాలయాలను ఏర్పాటు చేసే ప్రతిపాదనపై అధికారులతో చర్చించారు. రాష్ట్ర స్థాయి డైరెక్టరేట్ నుంచి జిల్లా స్థాయి వరకు స్పష్టమైన పాలనా బాధ్యతలు ఉండాలని మంత్రి పేర్కొన్నారు.కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల (సీహెచ్సీ), ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని దామోదర రాజనర్సింహ ఆదేశించారు. రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మౌలిక వసతుల లోపాలు, సిబ్బంది కొరత వంటి సమస్యలను జిల్లా స్థాయిలోనే ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సూచించారు. వైద్య సేవల విస్తరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యుల నియామకాలతో పాటు అవసరమైన నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల నియామక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన చికిత్సను చేరువ చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన తెలిపారు.

అనంతపురంలో ఓడిపోయే అవకాశమే లేదు.. కానీ ఓటమి ఎదురైంది: సీఎం చంద్రబాబు

ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సాకులతో న్యాయస్థానాలను ఆశ్రయించిందని, అయితే వారి కుట్రలను సుప్రీంకోర్టు సైతం తిప్పికొట్టిందని గుర్తుచేశారు. హింస, విధ్వంసకర రాజకీయాలకు ప్రజాతీర్పుతో కాలం చెల్లిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులపై బాధ్యత మరింత పెరిగిందని, రాష్ట్రాన్ని గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టేందుకు అందరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని చంద్రబాబు పేర్కొన్నారు. అయినప్పటికీ అక్కడ ఫలితాలు ఎందుకు అనుకూలంగా రాలేదో పరిశీలిస్తామని, ఓటర్లపై ఏమైనా ప్రలోభాల ప్రభావం పడిందా అనే కోణంలోనూ ఆరా తీస్తామని వివరించారు. ఎక్కడైనా పొరపాట్లు జరిగి ఉంటే సరిదిద్దుకోవడానికి తమకు ఎలాంటి భేషజాలు లేవన్నారు. 2024 సాధారణ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు కూటమికి ప్రజల్లో ఆదరణ మరింత పెరిగిందని, వైసీపీని ప్రజలు గతానికంటే ఎక్కువగా తిరస్కరించారని చెప్పారు. పెళ్లి సంబంధం కుదుర్చుకునే సమయంలో ఇరువైపులా ఏడు తరాలు ఎలా చూస్తారో, ప్రజలు కూడా అలాగే అభ్యర్థుల గుణగణాలు, నేపథ్యాన్ని లోతుగా పరిశీలించి విజ్ఞతతో ఓటు వేశారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజల చిరకాల ఆకాంక్ష మేరకు మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయడంతో పాటు పేదలకు ఇళ్ల పట్టాలు అందించామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా తాగు, సాగునీరు అందించామని, పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖ, అనకాపల్లి ప్రాంతాలకు గోదావరి జలాలు తరలించామని వివరించారు. ఈ అభివృద్ధిని గుర్తించిన ప్రజలు మార్కాపురంలో 21కి 21, అనకాపల్లిలో 24కి 24 జెడ్పీటీసీ స్థానాల్లో కూటమిని గెలిపించారని, విశాఖ మేయర్ పీఠాన్ని దాదాపు 2.50 లక్షల భారీ ఓట్ల మెజారిటీతో కట్టబెట్టారని వివరించారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక
నవంబర్ | మంగళవారం | 10 | 2026

ప్రజావాణి పెండింగ్ ఫిర్యాదుల్లో 75 శాతం పరిష్కరించాలి





● వచ్చేవారం నాటికి 200 ఫిర్యాదులకు పరిష్కారం చూపాలి.. అధికారులకు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశం

నల్గొండ, నవంబర్ 9 (విజయ కెరటం):

ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల్లో వచ్చే వారం నాటికి 75 శాతం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు.జిల్లాలో ప్రజావాణికి సంబంధించి ప్రస్తుతం 301 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో వచ్చే వారానికి 200 ఫిర్యాదులు, ఆ తర్వాతి వారానికి మరో 100 ఫిర్యాదులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 30 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న 149 ఫిర్యాదులపై సంబంధిత సెక్షన్ల సూపరింటెండెంట్లతో ప్రత్యేకంగా సమీక్షించి పరిష్కరించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని, ఈ నెలలో మరుగుదొడ్ల నిర్వహణ, భోజన నాణ్యత, హాస్టల్ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులందరికీ ఈ నెలాఖరులోగా ఆధార్ కార్డులు జారీ చేయడంతో పాటు మధ్యలో చదువు మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా పైపులైన్ల మరమ్మతులు, ఇతర ముందస్తు చర్యలు చేపట్టాలని, తాగునీటి ప్రాధాన్యత, వర్షపు నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వి.బి.జి. రాంజీ పథకం కింద మంజూరైన పనులన్నింటినీ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన చేయూత పింఛన్లను నిబంధనల ప్రకారం అర్హులకే పంపిణీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనర్హులకు పింఛన్లు మంజూరు చేయవద్దని స్పష్టం చేశారు. ఈ నెల 12న జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ జిల్లా పర్యటన నేపథ్యంలో ఎస్టీలకు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో నివేదికలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి నెల ఐదో తేదీలోగా జిల్లా అధికారులు తమ పర్యటనల డైరీలను సమర్పించాలని, వార్తాపత్రికల్లో ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి వివరణతో పాటు తీసుకున్న చర్యల నివేదికను అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టరేట్ ఏఓ మోతిలాల్‌ను ఆదేశించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 85 మంది ఫిర్యాదుదారులు తమ దరఖాస్తులను సమర్పించారు. వీటిలో రెవెన్యూ శాఖకు 39, ఇతర శాఖలకు 46 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, డీఆర్ఓ దశరథ్, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్మిక--కర్షక ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

● నవంబర్ 15న రైతు మహాసభల బహిరంగ సభ.. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి

నల్గొండ, నవంబర్ 9 (విజయ కెరటం):

కార్మిక--కర్షక ఐక్యతను మరింత బలోపేతం చేయాలని, అఖిలభారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభల సందర్భంగా నవంబర్ 15న నల్గొండలో నిర్వహించనున్న బహిరంగ సభలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎండీ సలీం పిలుపునిచ్చారు. సోమవారం సీఐటీయూ నల్గొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభను విజయవంతం చేయాలని ముద్రించిన కరపత్రాలను సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అఖిలభారత రైతు సంఘం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన నల్గొండ గడ్డపై నవంబర్ 15 నుంచి 18 వరకు రైతు సంఘం 36వ జాతీయ మహాసభలు నిర్వహించడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు.మహాసభల ప్రారంభం సందర్భంగా నవంబర్ 15న ఎన్జీ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు జిల్లాలోని కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్మిక--కర్షక ఐక్యతను చాటాలని కోరారు. మహాసభల సందేశాన్ని గ్రామగ్రామానికి, పారిశ్రామిక ప్రాంతాలకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలతో రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మిక హక్కులకు విఘాతమని ఆరోపించారు.రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు మూలం ఒకటేనని, దోపిడీ విధానాలను ఎదుర్కోవాలంటే ఇరువర్గాలు ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు.



కార్మిక హక్కుల పరిరక్షణతో పాటు పోరాటాలను మరింత ఉధృతం చేసేందుకు నవంబర్ 15న జరిగే బహిరంగ సభలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి సైదా సయ్యద్ హషం, సీనియర్ నాయకులు ఊట్కూరి నారాయణరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డబ్బీకార్ మల్లేష్, లకపాక రాజు, దండెంపల్లి సత్తయ్య, నల్గొండ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు భీమగాని గణేష్, అద్దంకి నరసింహ, గంజి రాజేష్, అనురాధ, కేవీపీఎస్ నాయకులు బొల్లు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మధ్యమధ్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.



వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద దేవికి పూల మొక్క ఇచ్చి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన వివిధ ప్రజా సంఘాల నాయకులు...

హన్మకొండ విజయ కెరటం ప్రతినిధి నవంబర్ 9.



ఈ రోజు కలెక్టర్ కార్యాలయ ఆవరణలో దీపావళి పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి గారిని కలిసి పూల మొక్క అందచేసి శుభాకాంక్షలు తెలియ చేయడం జరిగింది.ఈ సందర్భంగా కేడల ప్రసాద్ మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న కలెక్టర్... ప్రతీ సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తూ ఉన్నదని... ప్రజల ఫిర్యాదుల పై వెంటనే స్పందించి సంబంధిత అధికారుల దృష్టి కి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు...ఈ రోజు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రెండవ వార్షికోత్సవం సందర్భంగా ఆర్ టి ఐ నీ బలోపేతం చేయడానికి కృషి చేయాలని కలెక్టర్ గారిని కోరడం జరిగింది... కలిసిన వారిలో అఖిల భారత మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మరియు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కేడల ప్రసాద్ పటేల్, చెరువుల, ప్రభుత్వ భూముల పరి రక్షణ కమిటీ చైర్మన్ పెరుమాండ్ల లక్ష్మణ్, మంజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పోతన వెంకటేశ్వర్లు, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే , ఆర్ టి ఐ కార్యకర్త ఐతం నగేష్, ధరం సోత్ శ్రీనివాస్ నాయక్ తదితరులు ఉన్నారు...

ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాల సందడి!

● పేదల సొంతింటి కల సాకారం -- లబ్ధిదారులకు ఘన సత్కారం

వరంగల్, నవంబర్ 09 విజయ కెరటం :



ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల ఎన్నో ఏళ్ల సొంతింటి కలను నెరవేరుస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య అన్నారు. ప్రతి నిరుపేదకు గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.సోమవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 21వ డివిజన్ ఎల్.బి. నగర్‌లో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ హాజరై నూతన గృహప్రవేశాలు చేసుకున్న లబ్ధిదారులను అభినందించారు. ఈ సందర్భంగా వారికి నూతన వస్త్రాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల ఎన్నో ఏళ్ల సొంతింటి కలను నెరవేరుస్తోందని, ప్రతి నిరుపేదకు గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన జోగు రఘువీరు, రాజమణి, సంగ ఇంద్ర, కిన్నెర సుశీల, రాధారావు కృష్ణలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా పెంకుటిళ్లు, రేకుల షెడ్లలో నివసిస్తూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఇందిరమ్మ ఇళ్లతో తమ సొంతింటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. తమ కుటుంబాలకు సొంతింటి భరోసా కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, డివిజన్ అధ్యక్షుడు కొమ్మల సందీప్, సీనియర్ నాయకులు బొట్ల సదానందం, అజామ్ ఖాన్, అంబిదాసు, శ్రీనివాస్ యాదగిరి, కిషోర్, రమేష్, అఖిల్, జాగిర రఘువీర్, రాకిముద్దీన్, రాఘవ రెడ్డి, చైతన్య, నాని, పీసీసీ కార్పొరేటర్ కొత్తపల్లి శ్రీనివాస్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ విద్యార్థులకు ఉచిత పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్

దరఖాస్తులకు నవంబర్ 12 చివరి తేదీ

నల్గొండ, నవంబర్ 9 (విజయ కెరటం):

మైనారిటీ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలలో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి టి. విజేందర్ రెడ్డి తెలిపారు. TGPRB పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐతో పాటు TGPSC గ్రూప్-1, 2, 3, 4 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో ఈ నెల 12వ తేదీలోపు నల్లగొండలోని మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మైనారిటీ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యేల శుభాకాంక్షలు

కొడంగల్, నవంబర్ 9 (విజయ కెరటం):



తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలతో పాటు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

గ్రీవెన్స్ డేలో 22 మంది బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

నల్గొండ, నవంబర్ 9 (విజయ కెరటం):



ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధుల నుంచి వచ్చిన 22 మంది బాధితులు తమ సమస్యలపై ఎస్పీకి వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా బాధితుల ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా పరిశీలించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా, నిష్పాక్షికంగా విచారణ జరిపి త్వరితగతిన తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భూ వివాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు, ఆర్థిక లావాదేవీలు తదితర సమస్యలపై వచ్చిన వినతులను పారదర్శకంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

విజయకెరటం
తెలుగు దినపత్రిక

రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

- నవంబర్ 14న అగ్రి ఎక్స్‌పో -- కల్చరల్ ఫెస్ట్.. వేలాదిగా తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి పిలుపు



నల్లగొండ, నవంబర్ 9 (విజయ కెరటం):

అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. నవంబర్ 14న నల్లగొండ పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించనున్న అగ్రి ఎక్స్‌పో, కల్చరల్ ఫెస్ట్‌లో రైతులు, ప్రజలు వేలాదిగా పాల్గొనాలని కోరారు.సోమవారం పెద్ద గడియారం సెంటర్‌లో కల్చరల్ ఫెస్ట్ కోసం ఏర్పాటు చేస్తున్న వేదికలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతాంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తూ, అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిన ఘనత అఖిల భారత రైతు సంఘానికి ఉందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 'దున్నేవాడికే భూమి' అనే నినాదంతో భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ప్రజల విముక్తికి బాటలు వేసిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించే అగ్రి ఎక్స్‌పో, కల్చరల్ ఫెస్ట్‌లో ఆటలు, పాటలు, జానపద కళారూపాలు, పల్లె సుద్దులు, భజనలు, కోలాటాలు, వేషధారణలు, తెలంగాణ సాయుధ పోరాట నాటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలిపారు.ఈ సాంస్కృతిక సంబరాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, మహిళలు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతాంగ ఉద్యమ స్ఫూర్తిని చాటాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, బండా శ్రీశైలం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, పుచ్చకాయల నర్సిరెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్, నలపరాజు సైదులు, అవుట రవీందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నల్గొండ, నవంబర్ 9 (విజయ కెరటం):

తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్, హైదరాబాద్ ఆధ్వర్యంలో మైనారిటీ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షల కోసం ఉచిత స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి తెలిపారు.తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (TGPRB) కానిస్టేబుల్, ఎస్ఐతో పాటు టీజీపీఎస్సీ గ్రూప్-I, II, III, IV పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అర్హులైన మైనారిటీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ (గురువారం) లోపు తమ దరఖాస్తులను నల్గొండలోని జిల్లా మైనారిటీస్ సంక్షేమ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.మైనారిటీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి కోరారు.

ప్రజావాణి అర్జీలపై నిర్లక్ష్యం వద్దు!

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి -- కలెక్టర్ సత్య శారద



వరంగల్, నవంబర్ 09 విజయ కెరటం :



ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 56 అర్జీలు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 22, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 8, డీఆర్డీఏకు 4, గృహ నిర్మాణ శాఖకు 3, ఎంజీఎంకు 3, ఇతర శాఖలకు 16 దరఖాస్తులు అందాయి.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో ప్రజావాణికి వస్తున్నందున ప్రతి అర్జీకి ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రెవెన్యూ ఎల్. కిషోర్ కుమార్, స్థానిక సంస్థలు వై.వి. గణేష్, డీఆర్వో విజయలక్ష్మి, జెడ్పీ సీఈఓ వసంత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'పుష్ప 2', 'ధురంధర్ 2' రికార్డులు బ్రేక్.. బుకింగ్స్ లో 'రామాయణ' సంచలనం!

'రామాయణ: పార్ట్ 1' సరికొత్త చరిత్ర

బుక్‌మైషోలో గంట వ్యవధిలో 1.10 లక్షల టికెట్ల అమ్మకం

'పుష్ప 2', 'ధురంధర్ 2' చిత్రాల రికార్డులను అధిగమించిన వైనం

దీపావళి సెలవుల కారణంగా భారీగా పెరిగిన టికెట్ అమ్మకాలు

రాముడిగా రణ్‌బీర్ కపూర్, రావణుడిగా యశ్ నటనకు ప్రేక్షకుల బ్రహ్మరథం

భారత సినీ చరిత్రలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిన 'రామాయణ: పార్ట్ 1' చిత్రం సంచలనాలు సృష్టిస్తోంది. రణ్‌బీర్ కపూర్, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా, టికెట్ అమ్మకాల్లో సరికొత్త ఆల్-టైమ్ రికార్డును నెలకొల్పింది. ముఖ్యంగా ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ 'బుక్‌మైషో'లో గంట వ్యవధిలో అత్యధిక టికెట్లు అమ్ముడైన సినిమాగా నిలిచి, ఇప్పటివరకు ఉన్న అన్ని రికార్డులను బద్దలు కొట్టింది.విడుదలకు ముందు 'ధురంధర్ 2' చిత్రంతో పోలిస్తే 'రామాయణ'కు అడ్వాన్స్ బుకింగ్స్ కొంత బలహీనంగానే మొదలయ్యాయి. అయితే, సినిమా విడుదలైన తర్వాత మంచి స్పందనతో పుంజుకుంది. దీపావళి పండుగ సెలవులు ఈ చిత్రానికి భారీగా కలిసొచ్చాయి. సినిమా విడుదలైన ఐదవ రోజైన ఇవాళ ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య కేవలం గంట వ్యవధిలో 1.10 లక్షల టికెట్లు అమ్ముడయ్యాయి. 2023 ఆగస్టు నుంచి అందుబాటులో ఉన్న గంటలవారీ ట్రాకింగ్ రికార్డుల్లో ఈ ఘనత సాధించిన తొలి భారతీయ చిత్రంగా 'రామాయణ' నిలిచింది.ఇప్పటివరకు ఈ రికార్డు రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' (1.09లక్షలు) పేరిట ఉండేది. అంతకుముందు అల్లు అర్జున్ 'పుష్ప 2' (1.07లక్షలు) పేరిట ఉన్న రికార్డును 'ధురంధర్ 2' అధిగమించింది. ఇప్పుడు ఆ రెండు చిత్రాల రికార్డులను 'రామాయణ' చెరిపేసి అగ్రస్థానానికి చేరింది. దీపావళి సెలవుల కారణంగా నిన్నటి కంటే ఈ రోజు టికెట్ అమ్మకాలు ఏకంగా 67% పెరగడం విశేషం. విడుదలైన మొదటి నాలుగు రోజులూ ప్రతిరోజూ 1 మిలియన్ (10 లక్షలకు పైగా) బుక్‌మైషో బుకింగ్స్ సాధించిన ఆరో భారతీయ చిత్రంగా కూడా 'రామాయణ' నిలిచింది. నితేశ్ తివారీ దర్శకత్వం వహించిన ఈ మైథలాజికల్ డ్రామాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటించారు. లక్ష్మణుడి పాత్రలో రవి దూబే కనిపించారు. నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డీఎన్ఈజీ, యశ్ సొంత నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. ఈ చిత్రంలో సన్నీ డియోల్, అనుపమ్ ఖేర్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, వివేక్ ఒబెరాయ్, అరుణ్ గోవిల్, లారా దత్తా వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు.



ఈ వారం ఓటీటీ తెరపైకి వస్తున్న భారీ సినిమాలు ఇవే!

బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన 'జైలర్ 2'

ఈ నెల 12వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో

ఆంగ్లేయుల కాలం నాటి కథలో వచ్చిన 'రణబాలి'

విలక్షణమైన పాత్రలో కనిపించిన విజయ్ దేవరకొండ

ఈ నెల 13వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్

ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి ఈ వారం రెండు భారీ సినిమాలు బరిలోకి దిగుతున్నాయి. ఒకటి రజనీకాంత్ 'జైలర్ 2' అయితే, మరొకటి విజయ్ దేవరకొండ 'రణబాలి'. రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్ కుమార్ 'జైలర్ 2' సినిమాను తెరకెక్కించాడు. అక్టోబర్ 15వ తేదీన భారీ స్థాయిలో ఈ సినిమాను థియేటర్లకు తీసుకొచ్చారు. గతంలో వచ్చిన ఫస్ట్ పార్ట్ మాదిరిగానే ఈ సినిమాను రజనీకాంత్ తన విశ్వరూపాన్ని చూపించాడు. 'జైలర్' సినిమా స్థాయిలో పార్ట్ 2 లేకపోయినా, ఈ సినిమాలోని కొన్ని అంశాలు ప్రేక్షకులను చాలా బలంగా పట్టుకున్నాయి. యాక్షన్ .. ఎమోషన్స్ పరంగా మెప్పించగలిగింది. 800 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టగలిగింది. అలాంటి ఈ సినిమా ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్ వారు దక్కించుకున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయనున్నారు. తమిళంతో పాటు తెలుగు .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషలలోను ఈ సినిమాను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇక ఈ నెల 13వ తేదీన 'రణబాలి' కూడా రంగంలోకి దిగనుంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా, అక్టోబర్ 16వ తేదీన థియేటర్లకు వచ్చింది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కథానాయికగా రష్మిక ఆకట్టుకుంటుంది. ఆంగ్లేయుల కాలంనాటి ఈ కథలో తిరుగుబాటుదారుడిగా విజయ్ దేవరకొండ కనిపిస్తాడు.మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మించిన ఈ సినిమా, ఈ నెల 13వ తేదీ నుంచి ఈ సినిమా 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ కానుంది. ఓటీటీ వైపు నుంచి ఈ సినిమాలకి ఏ స్థాయి రెస్పాన్స్ లభిస్తుందనేది చూడాలి.



అడవిలో కాలుపెడితే అదృశ్యమే: ఓటీటీలో 'ది వన్'

అది ఒక దట్టమైన అడవి .. పొద్దుపోయిన తరువాత ఆ అడవి వైపు ఎవరూ వెళ్లరు. ఏం కాదులే అంటూ అటుగా వెళ్లిన వాళ్లెవరూ తిరిగి రాలేదు. అడవిలో వనదేవత విహరిస్తూ ఉంటుందనీ .. ఆ సమయంలో ఎవరైనా అటుగా వెళితే చంపేస్తుందని అంతా భావిస్తుంటారు. అలాంటి పరిస్థితులలో 'రిషి' తన భార్య 'మమత'ను తీసుకుని ఆ గ్రామానికి చేరుకుంటాడు. తన పూర్వీకులకు సంబంధించిన ఆస్తిపాస్తులను అమ్ముకుని వెళ్లడానికి వస్తాడతను. తాను వచ్చిన పనిని పూర్తి చేయడానికి అడ్డుగా ఉన్న అడవిని టచ్ చేయడానికి అతను సిద్ధపడతాడు. ఆ గ్రామస్తులంతా కూడా ఆ అడవి వనదేవత నివాసమనీ, అలాంటి అడవి జోలికి వెళితే వనదేవతకి ఆగ్రహం కలుగుతుందని రిషికి చెబుతారు. అదంతా ఒక మూఢనమ్మకం అని భావించిన రిషి లైట్ తీసుకుంటాడు. తాను అనుకున్న పనిని పూర్తి చేసే తిరిగి వెళ్లాలని నిర్ణయించుకుంటాడు. అప్పటి నుంచి అతనికి ఎలాంటి చిత్రమైన అనుభవాలు ఎదురవుతాయి? దాంతో అతను తన నిర్ణయాన్ని మార్చుకుంటాడా? మూర్ఖంగా ముందుకు వెళతాడా? అనేది కథ. ఈ కథ అంతా కూడా 'ది వన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే సినిమాకి సంబంధించినది. అడ్వెంచర్ తో ముడిపడిన హారర్ యాక్షన్ మూవీ ఇది. ఏక్తా కపూర్ - శోభా కపూర్ నిర్మించిన ఈ సినిమాకి, దీపక్ మిశ్రా దర్శకత్వం వహించాడు. సిద్ధార్థ్ మల్హోత్రా - తమన్నా ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, సెప్టెంబర్ 25వ తేదీన థియేటర్లకు వచ్చింది. అమిత్ త్రివేది - సామ్ సీఎస్ నేపథ్య సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, ఈ నెల 6వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528